## సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, జూలై 14: పేదల ఆరోగ్యం కోసం అందించే సీఎం సహాయనిధి ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన పుష్ప లత చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం స హాయ నిధి చెక్కును బాధిత కుటుం బానికి ఎమ్మెల్యే బండ్ల ఆదివారం అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు విజ య్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## తిమ్మప్ప స్వామి సన్నిధిలో అదనపు కలెక్టర్



స్వామివారిని దర్శించుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మల్దకల్, జూలై 14: ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంక టేశ్వర(తిమ్మప్ప) స్వామి ఆలయాన్ని ఆదివారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు మధుసూదనాచారి, రమేశాచారి, రవి చారి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, డీఆర్డీవో కాంతమ్మ, చంద్రశేఖర్‌రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండోకు విద్యార్థుల ఎంపిక



మెడల్స్ సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

వనపర్తి టౌన్, జూలై 14: మంచి ర్యాల జిల్లాలో ఈ నెల 19, 20, 21తే దీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో కరాటే పోటీలకు వనపర్తి విద్యార్థులు ఎంపికైనట్లు తైక్వాండో కరాటే అసోసియే షన్ జిల్లా అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవ నంలో 38వ సబ్ జూనియర్ తైక్వాండో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు మంచిర్యాల జిల్లాలో నిర్వహించ నున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి మహేశ్, సీనియర్ రెఫరీలు యుగంధర్ గౌడ్, రవికుమార్, శేఖర్, కిషన్, సవిద్, దీక్షిత్, పరశురామ్ వ్యవహరించారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కరాటే మాస్టర్స్ ప్రభాకర్, శ్రీహరి, శ్రీనివాసులు అభినందించారు.

## లెఫ్ట్ ఓవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి




మాట్లాడుతున్న యూటీఎఫ్ అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్

వనపర్తి టౌన్, జూలై 14: జిల్లావ్యాప్తంగా లెఫ్ట్ ఓవర్ (మిగిలిపోయిన) పోస్టులను వెంటనే భర్తీచేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా మిగిలిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీల ప్రక్రియ ప్రభుత్వం పూర్తిచేసిందని, పదోన్నతుల్లో మిగిలిపోయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, అనేక పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేసే వరకు విద్యా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను వెంటనే నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించి పీఆర్సీని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హమీద్, కార్యదర్శులు వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, హనుమంతు, తిమ్మప్ప, లక్ష్మణ్‌గౌడ్, రామన్‌గౌడ్, మురళి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ




మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

పానగల్, జూలై 14: ప్రజాసమస్యల సాధనకు ఉద్యమించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో సీపీఎం నూతన కార్యాలయాన్ని కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు చేసే అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. మతతత్వ రాజకీయాల పేరుతో ప్రజల భాగోద్వేగాలు రెచ్చగొట్టి అధికార పబ్బం గడుపుకోవడమే తప్పా చేసిన అభివృద్ధేమీ లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు అనేక రాయితీలు ఇచ్చి సామాన్య ప్రజల ను దోచుకుంటుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ అనేక నల్ల చట్టాలను తీసుకరావడం జరిగిందని, అందుకోసమే కేంద్రంలో గతంలో కంటే మూడోసారి ఎక్కువ మొత్తంలో ఎంపీ స్థానాల్లో ఓడిపోయిందన్నారు. మతోన్మాదం నుంచి ప్రజలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, బాల్యానాయక్, జంబులయ్య, వెంకటయ్య, భీమయ్య, వెంకటయ్య, రాము, నిరంజన్, ఆంజనేయులు, బాబునాయక్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానంతో కార్మికులకు నష్టం

- మున్సిపల్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా ఆంజనేయులు



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

వనపర్తి, జూలై 14: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతుంటే, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 1037 ద్వారా థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ పద్ధతి చేసేందుకు ప్రయత్నిస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా ఆంజనేయులు ఆరోపించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని గాంధీనగర్ మహిళా కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, శానిటైజేషన్, వర్కర్స్, జనరల్ బాడీ సమావేశానికి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా ఆంజనేయులు హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు 30ఏండ్లుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని ఓవైపు పోరాటం చేస్తుంటే మరోవైపు ప్రభుత్వం థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానం జీవో తీసుకొచ్చేందుకు చూస్తోందని ఆరోపించారు. ఈ జీవో వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఒకే కాంట్రాక్టర్ ఉండవచ్చని, కొత్త కార్మికులు రావాల్సి ఉంటుందని, సంవత్సరానికి ఓసారి టెండర్ మారుతుందని, కాంట్రాక్టర్ కూడా మారవచ్చని అభిప్రాయపడ్డారు. కార్మికులను కూడా మార్చే ప్రమాదం ఉంటుందన్నారు. ఇటువంటి ప్రమాదకరమైన జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రా క్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, పక్క రాష్ట్రంలో కార్మికులకు ఇస్తున్న రూ.21వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. నూతనంగా తెచ్చే జీవో 60, 63 కేటగిరీల జీతాలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రమాదాల్లో మరిణించిన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కింద రూ.25లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు అందించాలని కోరారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, తెలంగాణలో అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ విస్తీర్ణానికి తగ్గ కార్మికులను తీసుకోవాలన్నారు. ఉన్న కార్మికులపై పనిభారం తగ్గించాలని, వాటర్ వర్కర్స్‌తో సహా అందరికీ ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలన్నారు.

అలాగే మున్సిపల్ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గ డ్డం కుర్మయ్య, అధ్యక్షుడిగా మౌలాలి, ఉపాధ్యక్షురాలుగా ప ద్మ, శాంతమ్మ, జయమ్మ, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



నర్సింహ (ఫైల్)

పెబ్బేరు, జూలై 14: పెబ్బేరు సంతబజారు కాలనీలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం మేరకు శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన కొమారి నర్సింహ (54) ఏడేండ్ల కిందట కుటుంబంతో పాటు పెబ్బేరులో స్థిరపడ్డాడు. భార్య, కుమారుడు, కూతురు, కోడలుతో సహా నివసిస్తున్న ఆయన శనివారం రాత్రి ఇంట్లోనే రక్తపు మరకలతో మంచంపై చనిపోయి ఉన్న విషయం బంధువుల ద్వారా బయటపడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని, ఈ మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి దవాఖానకు తరలించినట్లు చెప్పారు. నర్సింహ అన్న కుమారుడు ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ఖిల్లాఘణపురం, జూలై 14: అనారోగ్యంతో బాధపడుతూ సరైన వైద్యం అందకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళ ఉరేసుకొని మృతిచెందిన ఘటన మండలంలోని అల్లమాయిపల్లిలో చోటుచేసుకున్నది. ఏఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. అల్లమాయిపల్లికి చెందిన యాద య్యా భార్య స్వప్న(30) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. సరైన వైద్యం అందకపోవడంతో రోజురోజుకూ క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని తలుచుకొని మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని మృతిచెందింది. ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచే సరికి స్వప్న తాడుకు వేలాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వప్న మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యుడు కతలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

## వీధి కుక్కల బెడదను తొలగించాలి

అమరచింత, జూలై 14: పట్టణంలోని ప్రజలకు వీధి కుక్కల బెడద తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నూరుల్ నదీబ్‌కు పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలో మొత్తం పది వార్డులు ఉండగా, మున్సిపల్ చైర్‌పర్సన్ నివాసం సమీపంలో ఉన్న మటన్ మార్కెట్‌తోపాటు శ్రీకృష్ణనగర్, జగన్‌వాడ, బీసీకాలనీ, సుభాశ్‌నగర్‌లో పదుల సంఖ్యంలో వీధి కుక్కలు ఒక చోట చేరి పిల్లలు, పెద్దలను వెంబడిస్తున్నాయని ఆరోపించారు. ఆరు బయటకు వెళ్లాలంటేనే చేతిలో కర్ర లేకుం డా వెళ్లడం సాధ్యం కావడం లేదని బీసీ కాలనీ యువకులు కుర్వరఘు, రవి తెలిపారు.

# పంట నాశనంపై కేసు నమోదు



ట్రాక్టర్‌తో దున్నిన పత్తి పంట

మల్దకల్, జూలై 14: మండల కేంద్రంలోని మహిళా రైతు కురువ తిమ్మమ్మ, తిరుమలేశ్‌కు చెందిన సీడ్ పత్తి పంటను గ్రామానికి చెందిన నడిమింటి పెద్దమల్లన్న, నర్సింహులు, రామ్‌కుమార్, జయరాం, నర్సింహులు శనివారం రాత్రి వేళల్లో ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేసినట్లు బాధితులు తెలిపారు. తమ సొంత భూమిలో సీడ్ పత్తి పంటను సాగుచేయగా.. తమ పక్కనే ఉన్న రైతులు పైన తెలిపిన వారు పంటను దున్నించారని పేర్కొన్నారు. ఈ విషయంపై కొన్ని నెలలుగా తగాదాలు ఉన్నాయన్నారు. గతంలో కూడా ఈ విషయమై ఎప్పీకి ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఉన్నతాధికారులు సర్వే చేయించుకొని తగదాలను పరిష్కరించుకోవాలని వివరించినట్లు తెలిపారు. అప్పులు తెచ్చుకొని పంటను సాగు చేశామని.. ఈ ఘటనతో ఎంతో నష్టపోయామని బాధితులు వాపోయారు. శనివారం రాత్రి మళ్లీ ఇలాంటి ఘటనకు పూనుకున్నారని ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కూడా ధ్వంసమైన సీడ్ పత్తి పంటను పరిశీలించి వెళ్లారన్నారు. పంటను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా.. పూర్తి విచారణ అనంతరం కేసులు నమోదు చేస్తామని ఎస్సై సురేశ్‌గౌడ్ తెలిపారు.

# 2014 ఎస్సై బ్యాచ్‌మేట్ల ఔదార్యం



శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేసిన చెక్కుతో ఎస్సైలు

గట్టు, జూలై 14: ఆత్మహత్యకు పాల్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబంపై 2014 ఎస్సైల బ్యాచ్‌మేట్స్ ఔదార్యాన్ని చూపి చేయూతను అందించారు. మృతి చెందిన ఎస్సై శ్రీనివాస్‌ది 2014 బ్యాచ్. కాగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 2014 లో ఎస్సై బ్యాచ్ ఏపీ, తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ పేరుమీద రూ.25లక్షల నగదును చెక్కుల రూపంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇదిలా ఉండగా గట్టు ఎస్సైగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన కేటీ మల్లేశ్ ఈ బ్యాచ్‌లో ఓ సభ్యుడు. కాగా ఈ వెల్ఫేర్ సొసైటీ ద్వారా పోలీసు కుటుంబాలకు చేయూత అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సైల బ్యాచ్ చేయూతను అందరూ అభినందిస్తున్నారు.

# మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

అయిజ, జూలై 14 : మండలంలోని సింధనూర్ గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ కుటుంబానికి అయిజ మండల మెకానిక్ అసోసియేషన్ ఆర్థికసాయం అందజేసింది. అనారోగ్యంతో కర్నూల్ దవాఖానలో చికిత్స పొందుతూ మెకానిక్ మహేశ్ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందిన విషయం తెలుసుకున్న అయిజ మండల అసోసియేషన్ సభ్యులు ఆదివారం సింధనూర్ గ్రామానికి చేరుకొని మృతుడి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. మహేశ్ మరణం కుటుంబానికి తీరని లోటని అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దేవరాజు బీచుపల్లి, చాంద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి తడిసి ముద్దయిన జనం

వనపర్తి, జూలై 14: పట్టణంలో ఆదివారం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ప్రజలు వానలో తడుసుకుంటూనే రోజు వారీ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షం పడడంతో గొడు గులు, కవర్లతో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. జిల్లాలో మేఘావృతం కావడం, వర్షం భారీగా పడడంతో రైతులు, ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

### పాన్‌గల్‌లో ముసురువర్షం

పాన్‌గల్, జూలై 14: మండలంలో ఆదివారం ముసురు వర్షం కురిసింది. ఈ వర్షంతో మెట్టపంటలు, వరినాట్లకోసం తుకాలకు మేలు చేకూరింది. అదేవిధంగా అక్కడక్కడా రైతులు వరినాట్లకు సిద్ధమవుతున్నారు. రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ముసురు వర్షంతో ప్రజలు బయటికి రాకుండా ఇండ్లల్లోనే ఉండిపోయారు.





వర్షంలోనే బైక్‌పై వెళ్తున్న యువకులు



వర్షంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు

## బలిగేరలో ఆరగిద్ద బస్సు నైట్‌హాల్ట్

గట్టు, జూలై 14 : గద్వాల–ఆరగిద్ద–గట్టు ఆర్టీసీ బస్సు ఇకపై ప్రతిరోజూ బలిగేరలో నైట్‌హాల్ట్ కానున్నది. ప్రతిరోజూ బస్సు బలిగేర నుంచి తెల్లవారుజాము 4గంటలకు బయలుదేరి గట్టు, ఆరగిద్ద, మల్దకల్ మీదుగా గద్వాలకు చేరుకోనున్నది. కాగా ఈ బస్సును బలిగేరలో నైట్‌హాల్ట్ చేయడంతో మరిన్ని గ్రామాలకు ప్రయోజనం కలుగనుంది. బస్సు నైట్‌హాల్ట్ విషయాన్ని ఆర్టీసీ సిబ్బంది ధ్రువీకరించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

అయిజ, జూలై 14 : ఆషాఢ మాసంలో వచ్చే గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని భరత్ నగర్‌లో బింగిదొడ్డి గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడని కమిటీ సభ్యుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శ్రీకృష్ణుడిని ప్రతిఒక్కరూ ఆరాధించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఈరన్న, వెంకటేశ్, రామచంద్ర, నర్సింహ, శివ, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ, అనంతమ్మ, సుభద్రమ్మ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

### దంతనూర్‌లో ..

మదనాపురం, జూలై 14: గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడేనని తెలియజేసే త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారమని కొత్తకోట త్రైతసిద్ధాంత సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దంతనూరులో ఈనెల 21న నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం నుంచి గ్రామగ్రామాన భగవద్గీత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాసన్న, బాలకృష్ణ, శివ, సీమయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయతోపాటు పలువురు గ్రామస్తులు ఉన్నారు.

## చావిడీల్లో కొలువైన పీర్లు

మల్దకల్, జూలై 14: మండలంలోని మద్దెలబండ, ఎల్కూర్, మల్దకల్, సద్దలోనిపల్లి, పాల్వాయి, విఠలాపురం తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను పురస్కరించుకొని చావిడీల్లో పీర్లు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మల్దకల్‌లో గురువారం గ్రామస్తులు పెద్దఎత్తున వచ్చి అలాయ్ ఆడారు. హిందూ, ముస్లింల కలిసి కులమతాల కతీతంగా మొహర్రం జరుపుకొంటున్నారు.

## చిన్నారుల సందడి



పీర్ల చావిడిలో పూజలు చేస్తున్న చిన్నారులు

వడ్డేపల్లి, జూలై 14: కులమతాలకు అతీతంగా అందరూ నిర్వహించుకునే పీర్ల పండుగ వేడుకలు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. కొంకల గ్రామంలో ఆదివారం చిన్నారులు పీర్ల చావిడి వద్ద సందడి చేశారు. పూజల అనంతరం చావిడి ముందు ఏర్పాటు చేసిన అలాయి గుంత చుట్టూ కేరింతలు కొడుతూ ఆడారు. పాఠశాలలకు సెలవులు కావడంతో ఎక్కువ సమయం అలాయి గుంత వద్దే ఆడుతూ కనిపించారు.

## శ్మశాన వాటిక పనులను అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు



శ్మశాన వాటిక పనులను అడ్డుకుంటున్న ఫారెస్టు అధికారులు

వనపర్తి, జూలై 14: పట్టణ శివారులోనిల శ్రీనివాసాపురంలో కొంతమంది అటవీ శాఖకు చెందిన స్థలంలో అక్రమంగా శ్మశాన వాటిక పనులు చేస్తున్న సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు వెళ్లి పనులను అడ్డుకున్నట్లు ఎఫ్ఆర్వో మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ శ్రీనివాస్‌పురం శివారులో పారెస్టుకు చెందిన అటవీప్రాంతంలోని సర్వే నెం 51/1లో కొంతమంది గ్రామస్తులు గ్రామానికి శ్మశాన వాటిక కోసం అక్రమంగా జేసీబీలు పెట్టి స్థలాన్ని చదును చేయడం గుర్తించి పనులను అడ్డుకోవడం జరిగిందని తెలిపారు. రెవెన్యూ అధికారులకు రెవెన్యూ పరిధిలోని 51/2లో ప్రభుత్వ భూమిని కేటాయించడం జరిగిందని, వారు అటవీశాఖకు చెందిన భూమిలో పనులు చేపట్టారని తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా పనులు చేపట్టిన వారిపై అటవీశాఖ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్వో వాణి, ఫారెస్టు అధికారులు రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాణి, బీట్ అధికారులు స్వాతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## తాజా మాజీ జెడ్పీటీసీకి సన్మానం



తాజా మాజీ జెడ్పీటీసీ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

పెబ్బేరు, జూలై 14: బీఆర్ఎస్ నాయకుడు, పెబ్బేరు తాజా మాజీ జెడ్పీటీసీ పెద్దింటి పద్మావెంకటేశ్ దంపతులను జిల్లా దళిత నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆమె పదవీ కాలం ముగిసిన సందర్భంగా ఆదివారం రంగాపురంలోని స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో డప్పు కళాకారుడు స్వామి, గద్వాల సురేశ్, చెన్నయ్య, రవి, నాగరాజు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

TOURS & TRAVELS



★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified 4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry Please Contact...
9182777641
9182777654
9182777794